అలంకారప్రాయంగా బస్టాండ్

- రోడ్డుపైనే ఆగుతున్న బస్సులు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు


ప్రయాణికులు, బస్సులు లేకుండా ఖాళీగా ఉన్న బస్టాండ్

ఆత్మకూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ అలంకారప్రాయంగా మారింది. బస్సులు బస్టాండులోకి రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి అవడంతో రోడ్డుపై నిలబడి వేచిచూడడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ, ములుగు వైపునకు మండల కేంద్రం నుంచి ఉద్యోగులు, విద్యార్థులు ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంటారు. అయితే బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో రోడ్లపైనే వేచి చూడాల్సి వస్తోందని ప్రయాణికులు మండిపడుతున్నారు. గతంలో కొంతకాలం బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేవని, ప్రస్తుతం బస్టాండ్‌లోకి రాకుండా వెళ్తున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మండల కేంద్రంలో పాతబస్టాండ్ వద్ద కూడా బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు రోడ్డుపై నిలబడేందుకు అవస్థలు పడుతున్నారని పలువురు తెలిపారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా మండల కేంద్రంలోని బస్టాండులో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, బస్సులు లోనికి వచ్చే విధంగా సంబంధిత అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరుతున్నారు.


ప్రయాణికురాలిని రోడ్డుపైనే దింపుతున్న బస్సు

ప్రజాధనం దోచుకుని విమర్శలా..?

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పక్కన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పరకాల : అభివృద్ధి పేరుతో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజలను తప్పుదారి పట్టించి ప్రజాధనాన్ని దోచుకున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సీఎంఆర్ నిధులతో పాటు ఫోర్జరీ సంతకాలు చేసి ప్రజాధనాన్ని దోచుకున్న చరిత్ర ధర్మారెడ్డికే చెల్లుతుందని ఆరోపించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. టెక్స్‌టైల్‌పార్క్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం బ్రోకర్ల మాదిరిగా వ్యవహరించిందని ఎద్దేవా చేశారు. భూముల విషయంలో రైతులను నిలువున ముంచారని, టెక్స్‌టైల్‌పార్క్ కోసం భూములు తీసుకున్న రైతులకు చేసిందేమి లేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు మధ్యవర్తిగా వ్యవహరించి సుమారు రూ.400 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరకాల నుంచి ఎర్రగట్టుగుట్ట వరకు రూ.65కోట్లతో నాలుగులైన్ల రోడ్డును మంజూరు చేశారని, టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు భూములు ఇచ్చిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.43 కోట్లతో 863 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ.. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో మంగళవారం జరిగే ఇందిరా మహిళ శక్తి భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, మాజీ ఎంపీపీలు స్వర్ణలత, సౌజన్య, పరకాల మండల, పట్టణ అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తప్పిపోయిన పాప తల్లిదండ్రులకు అప్పగింత



రామన్నపేట : వరంగల్ ఇస్లామియా గ్రౌండ్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో తప్పిపోయిన రెండేళ్ల చిన్నారిని బ్లూ కోట్స్ కానిస్టేబుల్ చిన్నారిని తల్లిదండ్రులకు వద్దకు చేర్చిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఇస్లామియా గ్రౌండ్‌లోని ఎగ్జిబిషన్ సెంటర్‌లో సఫా పర్వీన్ అనే రెండేళ్ల చిన్నారి తప్పిపోయి అహ్మద్‌కు దొరకగా అతను డయల్ 100 కాల్ చేసి సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న బ్లూకోట్స్ కానిస్టేబుల్ కల్యాణ్‌కుమార్ కాల్ రిసీవ్ చేసుకొని హుటాహుటిన చిన్నారి వద్దకు చేరుకొని తల్లిదండ్రులైన షబానా సుల్తానా-అహ్మద్ బాషాకు అప్పగించారు. కానిస్టేబుల్‌ను పోలీస్ అధికారులు, చిన్నారి తల్లిదండ్రులు అభినందించారు.

ఐడీ కార్డుల అందజేత



దేశాయిపేట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వరంగల్‌కు చెందిన కమల సాంఘిక సేవా సంస్థ ఉచితంగా ఐడీ కార్డులను అందజేయడం అభినందనీయమని హెచ్ఎం కె.చక్రపాణి అన్నారు. సోమవారం పాఠశాలలో 300 మంది విద్యార్థులకు, 16 మంది ఉపాధ్యాయులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. సంస్థ జనరల్ సెక్రటరీ నిర్మల ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు తమ సంస్థ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పిస్తూ విద్యార్థులకు టై, బెల్ట్‌లను అందజేస్తుందని అన్నారు. దాతలు గంధం అజయ్‌కుమార్, హెప్సిభ, జీసీడీఓ కె.ఫ్లారెన్స్, థెరిస్సా రవళిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాకర్స్ శ్రమదానం

కాజీపేట: వడ్డేపల్లి రిజర్వాయర్ ట్యాంక్ బండ్‌పై సోమవారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్ర నర్సింహారావు ఆధ్వర్యంలో సభ్యులు ట్యాంక్‌బండ్‌పై ఉన్న గార్డెన్‌లో మొలిచిన తుమ్మలతో పాటు పిచ్చిగడ్డిని తొలగించారు. ట్యాంక్‌బండ్ సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు కలుగకుండా ఉండడానికి శ్రమదానం చేస్తున్నట్లు అధ్యక్షుడు తెలిపారు.

కానిస్టేబుల్ ఔదార్యం

హన్మకొండ చౌరస్తా : గ్రూప్-3 పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థి బైక్ సడెన్‌గా ఆగిపోవడంతో అక్కడే విధుల్లో ఉన్న హనుమకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్ గంగాధరి రమేశ్ తన బైక్‌పై పరీక్ష కేంద్రం వద్ద దిగబెట్టాడు. కిషన్‌పురలోని ఆర్‌డీ కాలేజీలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థి బైక్ మర్కజీ సెంటర్‌కు రాగానే ఆగిపోయింది. ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ గమనించాడు. తన బైక్ పై పరీక్ష కేంద్రం వద్ద వదిలిపెట్టాడు. కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు.

13వ డివిజన్ అధ్యక్షురాలిగా పూర్ణ



దేశాయిపేట: నగరంలోని 13వ డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కుమ్మరి పూర్ణను నియమిస్తూ సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న జారీ చేసిన ఉత్తర్వులను సోమవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చేతుల మీదుగా ఆమె అందుకుంది. తనకు అవకాశం కల్పించిన కొండా దంపతులు, నవీన్‌రాజు, ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శిగా రమేశ్



మడికొండ: తెలంగాణ ముదిరాజ్ మహా సభ హనుమకొండ జిల్లా కార్యదర్శిగా 46వ డివిజన్ రాంపూర్ గ్రామానికి చెందిన పిట్టల రమేశ్‌ను నియమించినట్లు రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండా ప్రకాశ్ నియామక ఉత్తర్వులు సోమవారం జారీ చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవిని అప్పగించిన బండా ప్రకాశ్‌కు, బయ్యస్వామికి, పులి రజనీకాంత్‌కు, దువ్వ నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హక్కుల కోసం పోరాడాలి

హసన్‌పర్తి : బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడాలని సీపీఐ నాయకుడు నేదునూరి రాజమౌళి అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లాపురంలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. రాజమౌళి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బహుజనులకు న్యాయం జరగాలంటే సీపీఐలో చేరాలని పిలుపునిచ్చారు.

మొరం తవ్వకాలు వెంటనే నిలిపివేయాలి


మాట్లాడుతున్న కృపాకర్‌రెడ్డి

దామెర : మండల కేంద్రంలోని పెద్దగుట్ట సమీపంలో చేపడుతున్న మొరం తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని మాజీ ఎంపీటీసీ పోలం కృపాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామస్తులతో కలిసి మొరం తవ్వకాలు చేపడుతున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. జాతీయ రహదారి నిర్మాణం కోసమని గుట్టల నుంచి మొరం దోచుకొని వెళుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో సదరు కాంట్రాక్టర్ భారీ గుంతలు తీసి సుమారు వందల టిప్పర్ల మొరం తరలిస్తున్నాడని ఆరోపించారు. గట్టకిరువైపులా గతంలో మొక్కలు నాటితే వాటిని తొలిగించారని తెలిపారు. గ్రామ పంచాయతీకి ఎలాంటి సమాచారం లేకుండా మొరం తరలించడం సరికాదన్నారు. తవ్వకాలు నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్‌కు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు దామెరుప్పుల శంకర్, ఆలేటి రాజమౌళి, రాజు, మిరియాల రవి, సానబోయిన కిశోర్, వీరస్వామి తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కేంద్రం విఫలం

న్యూశాయంపేట : విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. సోమవారం హనుమకొండ పార్టీ కార్యాలయంలో సహాయ కార్యదర్శి రాజేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండో అతిపెద్ద నగరంగా విరాసిల్లుతున్న వరంగల్‌లో భారీ పరిశ్రమలు ఏర్పా టు చేయాలన్నారు. సీపీఐ ఆవిర్భావ వేడుకల సందర్భంగా డిసెంబర్ 10 నుంచి 26 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామాన జెండా ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు.

శ్వేతార్కుడికి ప్రత్యేక అలంకరణ

కాజీపేట : కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో సోమవారం భక్తులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించగా పండితులు పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐనవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో పండితులు శ్వేతార్కుడితో పాటు ఉత్సవ విగ్రహాలు, ఆలయ ఆవరణలో కొలువుదీరిన 29 దేవతామూర్తులను నూతన వస్త్రాలు, గజమాలాలు, పూలతో అందంగా అలంకరించారు. అన్నపూర్ణ భవన్‌లో భక్తులకు మహాన్నదానం చేశారు.

అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలి

వరంగల్ అర్బన్ : నగరంలో పూర్తి చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు వెంటనే చెల్లించాలని బల్దియా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కర్రు రమేష్, ఉపాధ్యక్షుడు సంతోష్ నాయక్, ప్రధాన కార్యదర్శి సంపత్, శ్రీనివాస్, మాధవ్ పాల్గొని మాట్లాడారు.

ఎంఎస్ఎఫ్ సదస్సును విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు చిరంజీవి మాదిగ

కేయూ క్యాంపస్: మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 28న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి సదస్సును కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో నిర్వహించబోయే సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన ఎంఎస్ఎఫ్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాల్లో ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా జాప్యం చేస్తుందన్నారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల మురళిమాదిగ, ఎంఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ముఖేష్, కేయూ ప్రధాన కార్యదర్శి అరిస్టాటిల్, వెంకటేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

యోగాలో శంకరయ్యకు గోల్డ్‌మెడల్



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన, పోలీస్ శాఖలో పనిచేస్తున్న తడక శంకరయ్య యోగాలో గోల్డ్ మెడల్ సాధించారు. శంకరయ్య చిన్నప్పటి నుంచి కరాటే, యోగా, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తూ యోగా మాస్టర్‌గా ఎదిగారు. హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నేషనల్ యోగాసన చాంపియన్ షిప్-2024లో ఇండియన్ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ యోగాధికులకు పథకాలు, చాంపియన్ ఆఫ్‌దా చాంపియన్‌గా తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్ అండర్ 41-50 విభాగంలో శంకరయ్య బంగారు పతకం కైవసం చేసుకున్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

ఎల్కతుర్తి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు సోమవారం మృతిచెందాడు. ముల్కనూరు ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సూర సమ్మయ్య (60) పొలం వద్దకు వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎల్కతుర్తి నుంచి ముల్కనూరుకు (టీఎస్2 ఎఫ్ఏ 0405 నంబర్‌గల) కారు డ్రైవర్ తన కారును అతివేగంగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న సమ్మయ్య తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే 108వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సమ్మయ్య మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుడి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



కమలాపూర్ : మండలంలోని శనిగరంలో బండి రమేశ్‌కు చెందిన పాడిగేదె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఆవుతో పాటు పాడిగేదెను సోమవారం పొలం వద్దకు తీసుకెళ్తుండగా ఇంటి సమీపంలోని మలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి అమర్చిన సపోర్ట్ వైరు పాడిగేదెకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. గమనించిన బాధితుడి భార్య రమ పాడిగేదెను కాపాడేందుకు ప్రయత్నించగా ఆమెకు షాక్ రావడంతో స్వల్పంగా గాయపడినట్లు తెలిపారు. స్థానికులు వెంటనే రమను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతిచెందిన పాడిగేదె విలువ రూ.85,000 విలువ ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రమేశ్ కోరాడు.

బాలిక అదృశ్యం

వేలేరు : మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన దాసరి అనూష(17) అదృశ్యమైనట్లు ఆమె తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై అజ్మీరా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లసాగర్ గ్రామానికి చెందిన దాసరి కుమార్ రోజుమాదిరిగానే భార్య కోమలతో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తన కూతురు అనూష కనిపించలేదు. దీంతో ఇంటి సమీపంలోని వారిని, బంధువులను ఆరా తీసినా ఆచూకి తెలియలేదు. దీంతో అతడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనూష తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముందస్తు అరెస్ట్

వేలేరు : లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ స్థాపనకు వ్యతిరేకంగా ఆందోళనకు వెళ్తున్న లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని జిల్లెల గడ్డ గ్రామానికి చెందిన లావుడ్య నరేష్ తన అనుచరులతో కలిసి లగచర్లకు వెళ్తుండగా ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

దళారులపై వెంటనే చర్య తీసుకోవాలి


రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుమన్

శాయంపేట : రైతులు సాగు చేసిన పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్న దళారులపై చర్య తీసుకోవాలని బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు మగ్గం సుమన్ కోరారు. మేరకు సోమవారం పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్‌కు వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో కొందరు వ్యాపారులు అక్రమ కాంటాలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోలు చేస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. రైతులను మభ్యపెట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ కమిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో రైతుల పక్షాన పోరాటం చేస్తామని ఈ సందర్భంగా ఆయన వినతిలో పేర్కొన్నారు.

వైభవంగా కార్తీకమాస పూజలు


శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

ఎల్కతుర్తి : మండలంలోని పలు శివాలయాల్లో సోమవారం కార్తీకమాసాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని వీరభద్రస్వామి (శివాలయం)లో కార్తీకదీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. ప్రతీ రోజు భక్తిపాటలతో భజన చేపట్టారు. దీంతో ఆలయాలు దేదీప్యమానంగా కళకళలాడుతున్నాయి. మండల కేంద్రంలోని ఆలయంలో ప్రత్యేక ఇత్తడి పాత్రలో జ్యోతిని వెలిగించి ధ్వజస్తంభం చివరన ఆకాశ దీపాన్ని వేలాడదీశారు. ఆ దీపం కార్తీ మాసంలో పూర్తిగా నిత్యం వెలుగుతూనే ఉండటం వలన దానిని ఆకాశదీపంగా పిలుస్తారని అర్చకుడు నందనం రవిశర్మ తెలిపారు. మహిళల ప్రత్యేక పూజలతో పండుగ వాతావరణం నెలకొంది.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి


జోగంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాయకులు

శాయంపేట : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించి నిర్వాహకులు సేవా దృక్పథంతో పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. మండలంలోని మైలారం, జోగంపల్లి గ్రామాల్లో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తితో పాటు తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సాగుపై అవగాహన అవసరం


రైతులతో వ్యవసాయ కళాశాల విద్యార్థులు

దామెర : యాసంగి సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్చన అన్నారు. మండలంలోని పులుకుర్తి రైతు వేదికలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఫామ్ హోల్డింగ్ సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా పెట్టుబడులు, ఆదాయ, వ్యయాల గురించి, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు, లాభాలు వంటి వివరాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యాసంగిలో ఏ పంటలు సాగుచేయాలని, వాటి విధానంపై అవగాహన కల్పించారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు వాగు వద్ద రోడ్డు డైవర్షన్ కోసం తాత్కాలికంగా నిర్మించిన వంతనపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. తాత్కాలికంగా పోసిన సీసీ రోడ్డుపై గుంత ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు హెచ్చరిక బోర్డు, ఫ్లెక్సీ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులే హెచ్చరికగా కర్ర, రాళ్ల ఏర్పాటు చేశారు.


కంఠాత్మకూరు వాగు వద్ద తాత్కాలికంగా నిర్మించిన రోడ్డుపై ఏర్పడిన గుంత

రాష్ట్రస్థాయి నాటక అవార్డులు ఇవ్వాలి


మాట్లాడుతున్న సదానందం

నయీంనగర్ : నాటక కళాకారులకు (నంది అవార్డు లాగా) కొత్త పేరు నిర్ణయించి తెలంగాణ రాష్ట్ర నాటక అవార్డులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కళాభివందనాలు తెలిపారు. కాళోజీ కళాక్షేత్రం ముందు భాగంలో కాకతీయ కళాతోరణం ఏర్పాటుచేసి కళాక్షేత్రంలో కాకతీయుల ప్రతిమలను ఏర్పాటుచేయాలని కోరారు. నాటక ప్రదర్శన ద్వారా ఓరుగల్లు కాకతీయుల చరిత్రను వెలుగులోకి తీసుకురావడానికి ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. సమాఖ్య సభ్యులు తిరుమల్లయ్య, బాలాజీ, సదానందచారి, ప్రభాకర్ , సంజీవరెడ్డి, చక్రపాణి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

హసన్‌పర్తి : రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన సుష్మిత, లక్ష్మణ్, ఇషాక్ పాల్గొని బంగారు పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం సుమాదేవి తెలిపారు. ఈనెల చివరి వారంలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. పీఈటీ పార్థసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.